'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## కేజ్రీవాల్‌కు బెయిల్

లిక్కర్ స్కాం అనేది ఓ బ్రహ్మపదార్థంలా తయారైంది. రూ.వంద కోట్ల కుంభకోణం అని అంటున్నప్పటికీ డబ్బు చేతులు మారడం గురించి ఇప్పటిదాకా దర్యాప్తు సంస్థలు కోర్టులో రుజువులు చూపలేకపోయాయి. ఈలోగా 'రాజకీయ అరెస్టులు' మాత్రం అడ్డూఅదుపూ లేకుండా జరిగిపోతున్నాయి. కేసులోని సెక్షన్ల తీవ్రత కారణంగా బెయిలు అంత సులభంగా దొరకడం లేదు. అప్రూవర్‌గా మారిన నిందితులు ఇచ్చే వాంగ్మూలాలతో నడుస్తున్న కేసు ఇది. కోర్టులు కూడా ఆధారాల గురించి దర్యాప్తు సంస్థలను నిలదీసిన సందర్భాలు ఈ కేసులో ఉన్నాయి.

అరెస్టయినవారిలో అత్యధికులు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) వారే. వారిలో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు ఇప్పటి వరకు బెయిల్ రాలేదు. ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్‌కు కొన్నాళ్ల క్రితమే బెయిల్ లభించింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ దరఖాస్తులను కోర్టులు పదేపదే తిరస్కరిస్తున్నాయి. ఆమె తర్వాత అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు ఇటీవల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఆయనకు బెయిల్ ఇచ్చే సందర్భంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రాముఖ్యం సంతరించుకున్నాయి. 'నిందితుడు పాత నేరస్థుడు ఏమీ కాడని' సర్వోన్నత న్యాయస్థానం నొక్కిచెప్పడం కేంద్రానికి ఓ చెంపపెట్టు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనవచ్చని కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు విస్పష్టంగా అనుమతి ఇవ్వడం గమనార్హం. ఆ మేరకు ఆయన కూడా తిహార్ జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే ప్రచార రంగంలోకి దూకి ప్రధాని నరేంద్ర మోదీపై, బీజేపీపై తనదైన రీతిలో విమర్శలు గుప్పిస్తూ వేడిని పుట్టిస్తుండటం మనం చూస్తూనే ఉన్నాం.

ఈ కేసులో, అదేవిధంగా ఇలాంటి కేసుల్లో అరెస్టయిన ఇతరులకు ఈ బెయిల్ తీర్పు ఓ మార్గదర్శకం అవుతుందా? అనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. అరెస్టు చేయబోయే ముందు లేదా చేసిన వెంటనే ఆయన తన పదవికి రాజీనామా ఇచ్చేందుకు నిరాకరించారు. సీఎంగా జైలుకు వెళ్లడమే కాకుండా జైలు నుంచి సర్కారును నడిపిన నేతగా ఆయన రికార్డు సృష్టించారు. ఆప్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచి అధికారం చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతోనే, కేంద్రంలోని బీజేపీ సర్కారు తనను జైలులో పెట్టిందని, వారికి ఆ అవకాశం ఇవ్వకూడదనే తాను రాజీనామా చేయకుండా మొండిగా నిల్చున్నానని కేజ్రీవాల్ చెప్తున్నారు. కేజ్రీవాల్ తరహాలోనే కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్ అరెస్టుకు ముందురోజే రాజీనామా చేశారు. ఇప్పుడాయన రాజీనామా చేసినందుకు చింతిస్తున్నారో లేదో తెలియదు కానీ, కేజ్రీవాల్ విషయంలో ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులు తనకూ వర్తిస్తాయని ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించడం గమనార్హం. దీనిపై ఈడీ, సీబీఐ సమాధానం చెప్పాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు రెండూ తర్జనభర్జనలో పడ్డాయని వినికిడి. కేంద్ర ప్రభుత్వం తన చెప్పుచేతల్లో ఉన్న దర్యాప్తు సంస్థలను విపక్షాలను లొంగదీసుకునేందుకు ఉపయోగించుకోవడం అనేది ఇప్పుడు బహిరంగ రహస్యమే. ఎన్నికలు సమీపించిన తర్వాత విపక్ష నేతలను అరెస్టు చేయడం అనుమానాలకు దారితీయడం తెలిసిందే. ప్రచారం చేయకుండా గొంతు నొక్కేందుకే విపక్ష నేతలను జైళ్లల్లో పెడుతున్నారనే ఆరోపణలు బలంగానే వినవస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం దేశ రాజకీయాల్లో కీలక మలుపుగానే భావించాలి. ఇలాంటి తీర్పులు ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠపరచడంలో ఎంతగానో తోడ్పడతాయని చెప్పక తప్పదు.

# గెలుపు, ఓటములపై మల్లగుల్లాలు

**దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో 4వ దశలో జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఏపీలో పలుచోట్ల ఉద్రిక్తతలు చోటుచేసుకోగా పోటాపోటీగా సాగిన ఎన్నికల సమరం ముగిసినట్లయింది. తెలంగాణ రాష్ట్రంలో శాంతియుత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. దీంతో ఎన్నికల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలు, ఏపీలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరిగింది. ఓట్ల లెక్కింపు కోసం నేతలు 20 రోజుల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది.**



**వి.వి.వెంకటేశ్వరరావు**
63008 66637



2019 ఎన్నికలతో పోల్చుకుంటే తెలంగాణలో పోలింగ్ శాతం పెరిగింది. ఆరు నెలల కిందటే ఓటు వేసిన ప్రజలు మరింత ఉత్సాహంగా పోలింగ్ బూత్‌లకు రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల్లో 62.07 శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి 64 శాతం దాటేసింది. పూర్తి లెక్కలు వచ్చేసరికి ఇది 70 వరకు ఉంటుందని అధికారులు అంటున్నారు. దీంతో రాజకీయపార్టీల నేతలు గెలుపు ఓటములపై మల్లగుల్లాలు పడుతున్నారు. గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలకు జరిగిన పోలింగ్ శాతం పెరగడంతో రాజకీయపార్టీల నేతలు రెండంకెల స్థానాలు సాధిస్తామన్న ధీమాతో ఉన్నారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య తీవ్రమైన ముక్కోణపు పోటీ నెలకొనడంతో పాటు హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో ఎంఐఎం, బీజేపీ మధ్య ఉత్కంఠ భరితమైన పోటీ కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. పార్లమెంటుకు జరిగిన పోలింగ్ శాతం పెరగడంతో ఇక్కడ అధికారపార్టీపై ఓటర్లు తమ అసంతృప్తిని తెలియజేశారన్న అనుమానాలున్నాయి.

డిసెంబర్ నెల నుంచి కాంగ్రెస్ పార్టీ పనితీరుపై తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ వెనుకబడే అవకాశాలు లేకపోలేదనే విషయాన్ని పోలింగ్ శాతం చూస్తే తెలుస్తోందని కాంగ్రెస్ పార్టీలోని మాజీ ఎంపీ ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమకు రెండంకెల సీట్లు వస్తాయన్న ఆశలతో ఉండటం సహజమే అయినా.. ఫలితాలు మాత్రం తెలంగాణాలో తారుమారయ్యే అవకాశాలు లేకపోలేదని ఓటర్ల నాడిని బట్టి తెలుస్తున్నది. కొన్నిచోట్ల బీజేపీ అభ్యర్థుల హడావుడి తప్ప అంతా ప్రశాంతంగా సాగింది. బీజేపీ అభ్యర్థులు అరవింద్, మాధవీలత ఇద్దరు పోలింగ్ కేంద్రాలకు తిరుగుతూ బురఖా వేసుకున్నవారిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వాళ్లు అలా వస్తే ఓటర్లను ఎలా గుర్తుపడతారంటూ అధికారులను నిలదీశారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు ఓటర్లను ఇబ్బంది పెట్టారని వారిపై కేసులు నమోదయ్యాయి. ఆరు నెలల కిందటనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసిన ప్రజలు ఈసారి ఏం వస్తాంలే అన్నట్టు కాకుండా భారీగా తరలివచ్చి ఓట్లు వేశారు. రాత్రి 11 గంటల వరకు అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం 64.74 శాతం తెలంగాణలో పోలింగ్ నమోదైంది. ఏపీ పోలింగ్‌లో హైడ్రామా కనిపిస్తే తెలంగాణలో మాత్రం సైలెంట్‌గా ఓటింగ్ జరిగిపోయింది. తెలంగాణలో పోలింగ్ జరుగుతుండగా భారీగా ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో నలభై ఫిర్యాదులకు సంబంధించి కేసులు రిజిష్టర్ చేసినట్టు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్ ప్రకటించారు. తెలంగాణ వ్యాప్తంగా 44 స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు భద్రపరిచారు. రాష్ట్రంలో 4,14,01,887 మంది ఓటర్లలో రెండు కోట్ల పది లక్షల 58 వేల 615 మంది మహిళలున్నారు. ఈ లెక్కన అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించేది వీళ్లే. అందుకే వీరి ఓటింగ్ శాతం పెరగడం ఎవరి తలరాత మారుస్తుందో అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నది.

మరోవైపు ఏపీలో ఇటు అసెంబ్లీ, అటు పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు జరగడంతో తీవ్ర ఉత్కంఠత ఏర్పడింది. మహిళలు, వృద్ధులు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ హక్కును వినియోగించుకున్నారు. ఇది అభ్యర్థులను ఏ తీరానికి చేరుస్తుందోనన్న టెన్షన్ పార్టీల్లో ఉన్నది. ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున గుమిగూడారు. రాష్ట్రంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి వరకూ పోలింగ్ జరగడం ఒక రికార్డు. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి ఉండటాన్ని బట్టి పోలింగ్ శాతం గణనీయంగా పెరిగిందని రాజకీయపార్టీలు లెక్కలు వేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రధానంగా అధికార వైఎస్సార్సీపీ, ప్రతిపక్ష టీడీపీ దాని మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ అభ్యర్థుల మధ్య తీవ్రమైన పోటీ ఏర్పడింది.

**జాతీయస్థాయిలో బీజేపీకి గట్టిపోటీ?:** దేశవ్యాప్తంగా మోదీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. ప్రధానంగా మణిపూర్ మతకల్లోలాలు.. అక్కడ మహిళలపై జరిగిన ఘోరమైన దాడులే దీనికి ప్రధానకారణమని స్పష్టమవుతున్నది. అలాగే.. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీకి 2024 ఎన్నికల్లో గట్టి దెబ్బ తగిలే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అలాగే పలు జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలు కూడా 2024లో భారత్‌లో జరుగుతున్న ఎన్నికలపై సర్వేలు నిర్వహించడం గమనార్హం. అయితే మోదీ ప్రాబల్యంతో తాము వరుసగా మూడవ సారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న ధీమాను బీజేపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీలు కూడా అధికారం తమదేనని అంచనాలు వేస్తున్నాయి. కానీ కూటమిలోని పలు పార్టీలు ఎన్నికల ముందు తొలగిపోవడంతో విజయావకాశాలపై ఆశలు సన్నగిల్లాయి. అయితే 2024 ఎన్నికల్లో గెలుపుపై ఎవరి ధీమా వాళ్లు వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు ప్రాంతీయ పార్టీల భవిష్యత్తుతో పాటు.. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి సీట్లు ఎన్ని వస్తాయి? అధికార బీజేపీ ఆశించినవిధంగా 400కు పైగా సీట్లు వస్తాయా? అనే అంశంపై తర్జనభర్జనలు పడుతున్నారు. అయితే బీజేపీకి ఉత్తరాదిలో సీట్లు తగ్గుతున్నందునే ఈసారి దక్షిణాది రాష్ట్రాలపై పొత్తులు... సీట్లు పెంచుకోవడానికి ఆ పార్టీ అగ్రనేతలు పాట్లుపడినట్టు స్పష్టమైంది. ఏ రాజకీయ పార్టీ ఎన్ని పాట్లు పడినా... తమకు లభించే సీట్ల సంఖ్య కోసం.. జూన్ 4 వరకు ఎదురుచూడాల్సిందే.



## పేదల గుండెల్లో కేసీఆర్ సార్

'కేసీఆర్ ఇచ్చినంతనే తప్ప.. పింఛను పెంచలేదు, కొత్తగ ఇవ్వలేదు..' అనే కోణంలో సార్వత్రిక ఎన్నికల్లో లాభితులు, ఆశావహుల మనసు కేసీఆర్‌వైపే గుంజిందని వినవస్తున్నది. ఈమాత్రం పింఛను కేసీఆర్ పుణ్యమే కదా అని పోలింగ్ సరళిని ఇమాందారి పట్టించినట్టు తెలియవస్తున్నది. రైతు లోకానిదీ దాదాపు ఇటువంటి అంతరంగమేనని వినికిడి. సామాజిక భద్రత పింఛనుదారుల్లో మాదిరిగానే, అన్నదాతల్లోనూ సగటున వయసులో పెద్దవారే ఎక్కువగా ఉంటారు. ఈ వర్గాల్లో చాలామంది స్వీయ మథనం మీదటే ఈవీఎంల బటన్ ఒత్తినట్టు చర్చ జరుగుతున్నది.

తొమ్మిదిన్నరేండ్ల పాటు కడుపారా సంక్షేమాన్ని ఆస్వాదించిన ఆయా వర్గాలు ఈ ఐదు మాసాల అనుభవాన్ని బేరీజు వేసుకుని ఉంటారు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు ఇవి జాతీయ ఎన్నికలే అయినప్పటికీ, వయసు పైబడిన వారిలో చాలా మంది ఆలోచన భిన్నంగా ఉండొచ్చు. తమ సంక్షేమం 'కేంద్రం'గానే వారు ఓటును నిర్ణయిస్తుంటారు. తెలంగాణలో వివిధ రకాల పింఛను లబ్ధిదారుల సంఖ్య దాదాపు 44.82 లక్షలు. సాధారణ పింఛను రూ.2 వేలు. అయితే వచ్చే నెల నుంచి రూ.4 వేలు ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఈ విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. అప్పటి పింఛనుకు చిహ్నంగా చేతి రెండు వేళ్లు, తాము అధికారంలోకి వచ్చిన తదుపరి మాసం నుంచి ఇచ్చే రూ.4 వేలకు గుర్తుగా చేతి నాలుగు వేళ్లను చూపిస్తూ ఆ విషయాన్ని ఆయన జనంలోకి బాగా తీసుకెళ్లగలిగారు. పింఛన్ డబుల్ అవుతుందనే ఆశలు రేకెత్తించారు. అయితే సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి ఐదు నెలలు దాటినా డబుల్ పింఛను లబ్ధిదారుల అనుభవంలోకి రాలేదు. ఈ అంశం వాళ్లలో అనేక మందిని ఆలోచింపజేసిందని అంటున్నారు. ఆ మేరకు ఓటింగ్‌లో ప్రభావం పడటంపై విశ్లేషిస్తున్నారు. పింఛను పెంపుతో నిమిత్తం లేకుండా కనీస సామాజిక భద్రత పారితోషికాన్ని రూ.2 వేలు చేసింది కేసీఆరే కదా అనే కృతజ్ఞతతో కట్కు ఒత్తారని కూడా అంటున్నారు.

ఇదిలా ఉంటే.. మొత్తానికి ఆపసోపాలతో కడపటి ఫసలు రైతుబంధు చాలామటుకు వేసినప్పటికీ సాగదీత ధోరణి కర్షకులు మనసు మీదకు తీసుకునేలా చేసిందనే అభిప్రాయం లేకపోలేదు. రాష్ట్రంలో 1.43 కోట్ల ఎకరాలకు గానూ 58.33 లక్షల మంది వ్యవసాయదారులకు కేసీఆర్ సర్కారు సాలీనా రెండు పర్యాయాలు కలిపి రూ.10 వేల చొప్పున నగదు బదిలీ చేసింది. రైతు భరోసా పేరిట పెట్టుబడి సాయాన్ని రూ.15 వేలకు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం బాస చేసింది. పెంపు అటుంచి పాత మొత్తం ఇవ్వడంలోనే తటపటాయింపులు రైతులను కినుక వహింపజేశాయనే మాట వచ్చింది. ఇదీ ఎంత వరకు ప్రభావితం చేసి ఉంటుందన్న తీసివేతలు, కూడికలు జోరందుకుంటున్నాయి. విశ్వసనీయతా కొలమానం అవుతున్నది.

*ఈ లోక్‌సభ ఎన్నికల నాటికి 3.32 కోట్ల మంది ఓటరు జాబితాల్లో ఉన్నారు. వీరిలో 50 ఏండ్లు పైబడిన వారు రమారమి 95 లక్షల మంది. అన్ని వయసుల వారికీ ప్రీతిపాత్రులైన కేసీఆర్ ముఖ్యంగా పెద్దవాళ్ల మదిలో గట్టిగా సంక్షేమ ముద్ర వేశారనే పేరుంది. 'కేసీఆర్ గుండెల్లో తెలంగాణ.. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్' అనే కేసీఆర్ వాక్కు ఈవీఎంలలో ప్రతిఫలిస్తుందనే అంచనాలున్నాయి.*



**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
94408 50384

# శాంతియుత ప్రగతికి చిరునామా



**పాతూరి వెంకటేశ్వరరావు**
98490 81889

**నాడు తెలంగాణ సంరక్షణార్థం మొక్కగా మొలిచి, నేడు మానై తెలంగాణకు సుజలాలు, సుఫలాలను అందించిన పార్టీ 'బీఆర్‌ఎస్'. దశాబ్దకాలంలో ఆకలి తెలంగాణను అన్నపూర్ణగా, పారిశ్రామిక కేంద్రంగా, ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన ప్రగతిశీల పార్టీ బీఆర్‌ఎస్.**

తెలంగాణ నూతన సచివాలయానికి అంబేద్కర్ అని నామకరణం, దానిముందు సుందరవనంలో సమున్నత అంబేద్కర్ విగ్రహ నిర్మాణం అనేవి రాజ్యాంగం, రాజ్యాంగకర్త అంబేద్కర్ పట్ల కేసీఆర్‌కున్న అపార గౌరవానికి చెరగని నిదర్శనం. పాలనా సౌలభ్యం కోసం చిన్న రాష్ర్టాలే శ్రేయస్కరం అన్నది అంబేద్కర్ సూచన. ఆయన ఆశయంతో ఏకీభవించినందునే, తెలంగాణ రాష్ర్టాన్నే కాదు, దాన్ని తిరిగి చిన్న జోన్‌లు, చిన్న జిల్లాలుగా పునర్విభజించారు. రాజ్యాంగం పట్ల కేసీఆర్‌కు ఉన్న నిబద్ధతకు ఇంతకన్నా నిదర్శనమేం కావాలి?

వ్యవసాయాభివృద్ధికి సాగునీటి ఆవశ్యకతను గుర్తించి 'మిషన్ కాకతీయ' ద్వారా సుమారు 47 వేల చెరువుల పునరుద్ధరణ, రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాల నిర్మాణాల ద్వారా 100 శాతం సాగునీటి వనరులను పెంపొందించుకున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని నీతి ఆయోగ్ నుంచి ప్రశంసలందుకున్న భారతైక ముఖ్యమంత్రి కేసీఆర్. ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాల మధ్య పోటీని కొనసాగించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన, తక్కువ ధరలకు సేవలందించారు. ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ ద్వారానే రిజర్వేషన్లను, తద్వారా పేదల ఉపాధికి భద్రతను కల్పించగలమన్న వాస్తవాన్ని గ్రహించిన మానవీయ నేత కేసీఆర్. అందుకే 'మీరు తెగనమ్మిన ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ తిరిగి మేం స్వాధీనం చేసుకొని పేదలకు భరోసా కలిగిస్తాం మోదీజీ' అంటూ ప్రధానికి సవాలు విసిరిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్.

'పేదలకు చేపనిస్తే, ఆ పూటకు భోజనం పెట్టినట్టే. చేపలు పట్టే విద్య నేర్పితే జీవితాంతం వాళ్లకు భోజనం పెట్టినట్టే' అనే జీవిత సత్యాన్ని గ్రహించిన కేసీఆర్ నాడు 120గా ఉన్న గురుకులాల సంఖ్యను 1020కి పెంచి, వాటి నిర్వహణ బాధ్యతను ఆశయ సాధకుడైన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అప్పగించారు. అలా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లలను సమున్నత విద్యావంతులుగా తీర్చిదిద్దించారు. వాళ్లలో వెయ్యి మందికి పైగా దేశదేశాల్లో ధృవతారల్లా భాసిస్తున్నారన్నది జగమెరిగిన సత్యం. బీఆర్‌ఎస్ నేతలు గత ఎన్నికలకు ముందుగా మెరుపు తీగల వంటి సదరు విద్యార్థులను తెలంగాణ రప్పించి, తమ ప్రగతికి ఆ గురుకులాలే దృఢమైన పునాదులన్న వాస్తవాన్ని వాళ్ల నోటితోనే చెప్పించి ఉంటే, మేధావులకు జ్ఞానోదయం అయ్యేది.

'సర్వత్రా సమస్థిత మీశ్వరమ్..' అన్న గీతాప్రబోధ ఆవశ్యకతను గుర్తించి, పతనమైన అడవులను పునరుద్ధరించేందుకు, నిర్విరామంగా పరిశ్రమించిన, వర్తమాన భారతైక నేత కేసీఆర్. ప్రతి గ్రామంలో నర్సరీల పెంపకం ద్వారా దాన్ని నిరంతర ప్రక్రియగా




రూపొందించారు. హరితహారం, గ్రీన్ ఛాలెంజ్‌లను విజయవంతం చేసి తెలంగాణ రాజధానికి 'క్లీన్ అండ్ గ్రీన్' అవార్డును సాధించిన వ్యక్తి కేసీఆర్. సముద్రంలో చేరిన నదీనదాల జలాలన్నీ సముద్ర జలమే కదా? అలాగే తెలంగాణలో నివసిస్తున్న అన్ని మతాలవారిని తెలంగాణ కుటుంబసభ్యులుగానే భావించారు కేసీఆర్. తన దశాబ్ది పాలనలో ఒక్క మత కల్లోలం గానీ, ఉగ్రవాద విధ్వంసం గానీ జరక్కుండా కాపాడుతూ, ప్రపంచ పరిశుద్ధ నగరాలలోనే కాదు, ప్రపంచ ప్రశాంత నగరాలలోనూ ఒకటిగా హైదరాబాద్‌ను నిలిపిన సిసలైన హిందువు కేసీఆర్. ఫ్లోరైడ్ నిర్మూలన కార్యక్రమాలు నిర్వహిస్తూనే మిషన్ భగీరథ ద్వారా సుజలాలనందిస్తూ 'ఫ్లోరైడ్ రహిత తెలంగాణ'ను రూపొందించారు. ఈ అపూర్వ ప్రజాహిత ప్రగతి కార్యక్రమాలే కేసీఆర్ దార్శనికతను, రాజనీతిజ్ఞతను చాటి చెప్తున్నాయి.

ఇక మీడియా ద్వారా ఆత్మస్తుతిని-సోషల్‌మీడియా ద్వారా పరనిందను చేయించి ప్రజలకు కల్లబొల్లి హామీలను, ప్రతిపక్షాలపై అభాండాలను గుప్పించి, ఊకదంపుడు ఉపన్యాసాలు దంచేసి ప్రధాని అయ్యారు నరేంద్ర మోదీ. మోదీ మార్గదర్శకత్వంలో తెలంగాణ సీఎం అయ్యారు రేవంత్‌రెడ్డి. మోదీ ఘనకార్యాలలో ఉదాహరణకొక్కటి. ప్రకృతి, పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్న స్పృహను కోల్పోయిన మోదీ, అడవులను పునరుద్ధరించకపోగా, ఉన్న అడవులను అభిమాన కార్పొరేట్లకు అప్పగించారు. లక్షల ఎకరాల అటవీ విధ్వంసానికి వీలుగా చట్టాలను సవరించి, పర్యావరణ కాలుష్యాభివృద్ధికి రహదారి నిర్మించారు. ప్రపంచ కాలుష్య నగరాలలో అత్యధిక కాలుష్య నగరాలను కలిగి ఉన్న దేశంగాను, ప్రపంచ ప్రథమ కాలుష్య నగరమైన 'ఢిల్లీ'ని రాజధానిగా కలిగి ఉన్న దేశంగాను భారత్‌ను నిలిపిన ఘనుడు ప్రధాని మోదీ.

తెలంగాణతో సహా దక్షిణ భారతానికే సమీప భవిష్యత్తులో ముంచుకురానున్న ప్రమాదం డీ లిమిటేషన్ ప్రక్రియ. నాటి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 శాతం కుటుంబ నియంత్రణను పాటించిన దక్షిణ భారత్‌లో భారీగా జనాభా తగ్గింది. అవిద్య, అంధ విశ్వాసాల కారణంగా కుటుంబ నియంత్రణను పాటించని ఉత్తర భారత్‌లో జనాభా భారీగా పెరిగింది. జనాభా ప్రాతిపదికన జరుగనున్న డీ లిమిటేషన్ కారణంగా ఉత్తర భారత్‌లో ఎంపీల సంఖ్య భారీగా పెరుగుతుంది. దక్షిణ భారత్‌లో ఉన్న ఎంపీల సంఖ్య తగ్గుతుంది. ఉత్తర భారతాన గల అత్యధిక ఎంపీలతో అధికారాన్ని చేపట్టగల బీజేపీ, కాంగ్రెస్‌లు దక్షిణ భారతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉన్నది. అంతేకాదు, అత్యధిక ఆదాయ వనరులున్న హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేసే దుస్సాహసానికి కూడా వెనుకాడవు ఈ జాతీయ పార్టీలు. అందుకే తెలంగాణ మేధావులు, ఉద్యోగులు, ప్రజలు, మేధావులు జాగ్రత్తగా ఉండాలి.

**(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)**




## మోదీ గెలవరు.. అది గ్యారెంటీ!

*సందేశ్‌ఖాలీ అంశంపై బీజేపీ నేతలు ప్రధాని మోదీ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నిజాలను దాచాలని చూస్తున్నారు. 'గ్యారెంటీ బాబు' (మోదీ) పశ్చిమబెంగాల్ గురించి దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ, మోదీ మరోసారి అధికారంలోకి రారన్నదే ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఒకేఒక్క గ్యారెంటీ.*



**- మమతా బెనర్జీ,** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

లేఖ

## తడిసిన వడ్లనూ కొనాలె

రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు అన్నదాతలకు శాపంగా మారాయి. వడ్లను రాశులుగా పోసి అమ్మేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో అక్కడక్కడా ఈదురు గాలులతో కూడిన వానలు కురిశాయి. దీంతో రాశికి వచ్చిన వడ్లు నానుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో వడ్లను కొనకపోవడంతోనే రైతులకు ఈ దుస్థితి దాపురించింది. రాష్ట్ర ప్రభుత్వం తడిసిన వడ్లను సైతం కొని రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. లేకుంటే రాష్ట్ర కాంగ్రెస్ పాలకులు ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

*- గౌటి కిరణ్*